సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం


నగరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. మండల కేంద్రమైన నగరంలోని ఎస్టీ కాలనీ, గొడపాలెం, మాన్యంవారిపాలెం, కాపుల పాలెం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎంపీ మోపిదేవి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని బుడగ జంగాలు తమకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇప్పించాలని, శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని, గొడపాలెంలో రహదారులు అభివృద్ధి పరచాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి సుమారుగా లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ మోపిదేవి 950 గడపలు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యులు మాన్యం నాగమణి, సర్పంచి ఇంకోల్లు రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఉప్పాల వెంకటేశ్వరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్తి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు నారయణ, నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలి


ఉప్పూడిలో బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు


కొల్లూరులో పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు


వేమూరు పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

రేపల్లె రూరల్: ఓటరు జాబితా అభ్యంతరాలపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని తహసీల్దార్ మల్లికార్జునరావు ఆదేశించారు. ఓటర్ల జాబితాలపై మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌ను ఆదివారం పరిశీలించారు. ఒకే డోర్ నంబరుపై ఉన్న ఓట్లను ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు. దీనిపై పలువురి నుంచి డబుల్ ఎంట్రీలంటూ అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఇప్పటికే పలుమార్లు మృతులు, డబుల్ ఎంట్రీలపై పలుమార్లు విచారణ జరిపినా రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. ఈ విడతలో బీఎల్వోలు రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపి అనర్హత ఓట్ల తొలగింపునకు తమకు సిఫార్సు చేయాలని కోరారు. ఉప్పూడి, నల్లూరుపాలెం, తుమ్మల, మోళ్లగుంట, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఓటరు జాబితాలపై అప్రమత్తంగా ఉండాలి

కొల్లూరు: ఓటర్ల జాబితాలలో ఎటువంటి లోటుపాట్లకు తావుండకుండా బీఎల్‌ఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జెడ్పీ సీఈఓ, వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎల్‌ఓలు ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపు ప్రక్రియలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరణించిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించాలని ఆదేశించారు. రెండ్రోజులపాటు నిర్వహించిన ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియలో భాగంగా కొల్లూరు మండలంలో ఓటు హక్కు కోసం 77 మంది దరఖాస్తు చేసుకోగా, ఓట్ల తొలగింపునకు 11 దరఖాస్తులు, మార్పులు, చేర్పులకు 20 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓట్లు నమోదు కార్యక్రమం

వేమూరు: ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. నియోజక వర్గంలో రెండో రోజు క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. వేమూరు మండల కేంద్రంలో శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. నియోజకవర్గంలో 233 పోలింగ్ బూత్‌ల్లో 622 అర్జీలు అందజేశారని చెప్పారు. మొదటి రోజు 253 అర్జీలు అందజేశారన్నారు. ఓటు నమోదుకు 178, దరఖాస్తులు, తొలగింపులు 38, దరఖాస్తులు, సవరణలు 15, దరఖాస్తులు, తప్పలు సరి చేయుట 22, దరఖాస్తులు అందజేశారన్నారు. రెండో రోజు ఓట్లు నమోదుకు 218, దరఖాస్తులు, తొలగింపు 75, దరఖాస్తులు, సవరణ 76 దరఖాస్తులు మొత్తం 369 అర్జీలు రావడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, వీఆర్వోలు భరత్‌రాజ్, సామ్రాజ్యం పాల్గొన్నారు.

చెరుకుపల్లి మండలంలో..

చెరుకుపల్లి: ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, ఆరుంబాక, కుంచాలవారి పాలెం, రాంబొట్ల పాలెం గ్రామాల్లోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ జాబితా కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలొ వీఆర్వోలు నరసింహరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవం


గుర్రం గాంధీ చిత్రపటం వద్ద నేతల నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్‌ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం, 29వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని సొసైటీ ఆధ్వర్యంలోని శిల్పి అక్కల రామయ్య, కోటిరత్నమ్మ కల్యాణమండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్టేట్ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘీయులు ఐకమత్యంగా సొసైటీ ద్వారా గత 28 ఏళ్లుగా చేపడుతున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని సరళాదేవి చెప్పారు. సంఘీయుల్లో విద్యావ్యాప్తికి కృషి చేయటం ముదావహమన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి చెందగలమని సోదాహరణంగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు ఎంవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలను ప్రశంసించారు. వార్షికోత్సవం సందర్భంగా 225 మంది నిరుపేద మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పద్మశాలీ సంఘ రాష్ట్ర నేత గుర్రం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సతీమణి జయలక్ష్మి, సరళాదేవిని నరసింహారావు, శ్రీరామ్ సత్కరించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి గంజి శివభుజంగ ప్రభాకరరావు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, సొసైటీ ప్రధాన సలహాదారు రాచాబత్తుని శ్రీనివాసరావు, ప్రముఖ శిల్పి అక్కల శ్రీరామ్, సొసైటీ ఉపాధ్యక్షుడు జొన్నాదుల మహేష్, కోశాధికారి దివి పురుషోత్తం ప్రసంగించారు. కటకం శేషగిరిరావు, కటకం శివప్రసాద్, దివి హేమంత్, దామర్ల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

300 మందికి పరీక్షలు



గుంటూరు మెడికల్: స్థానిక నల్లచెరువు మదర్సాలో యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించామని సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ తెలిపారు. వైద్య శిబిరంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాంబశివరావు, దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఫరీద్, హాస్పిటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, మదర్ సా పెద్దలు ముఫ్తి బాషిద్, ముఫ్తి రెహమాన్, రఫీ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: పాత కక్షలు, వ్యక్తిగత కారణాలతో చేసిన దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా పెదలంకకు చెందిన తోట శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు గతం నుంచి మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని రామాలయం సమీపంలో తోట శ్రీనివాసరావుపై యార్లగడ్డ శ్రీనివాసరావు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

ఇగ్నో కోర్సులతో విద్యావంతులుగా ఎదిగే అవకాశం



మాట్లాడుతున్న ఇగ్నో స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ భాను మురళీధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న దూరవిద్య కోర్సులతో విద్యావంతులుగా ఎదిగే అవకాశాల్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఇగ్నో స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఏ. భాను మురళీధర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో స్టడీ సెంటర్‌లో ఆదివారం ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాను మురళీధర్ మాట్లాడుతూ కళాశాలలో 1987లో ఇగ్నో స్టడీ సెంటర్ ఏర్పాటైందని తెలిపారు. దూర విద్యా విధానంలో 500 స్టడీ సెంటర్లు, 58 రకాల కోర్సులతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా అడ్మిషన్లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్, ఫీజుల చెల్లింపు, పేపర్ సెలక్షన్, స్టడీ సెంటర్, కౌన్సెలర్స్ గురించి విద్యార్థులకు వివరించారు. ఇగ్నోలో చేరిన విద్యార్థులంతా ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. అనంతరం ఎమ్మెస్సీ సీఎఫ్‌టీ, మేనేజ్‌మెంట్, పీజీ కోర్సులతో పాటు ప్రాజెక్టులు, స్పెషల్ ఇంగ్లిషు, అసైన్‌మెంట్స్ గురించి ఇగ్నో సీనియర్ కౌన్సెలర్స్ ప్రొఫెసర్ టీడీ విమల, బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, కె. సాంబశివరావు, ఎం. పూర్ణచంద్రరావు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి. దేవేంద్ర గుప్తా, వై. మార్కండేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీసీతారామ గానసభ సంగీతోత్సవాలు

తెనాలి: పట్టణంలో ప్రఖ్యాత సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ సంగీతోత్సవాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. 2017 వరకు అంటే 70 ఏళ్లపాటు కొనసాగిన సంస్థ సంగీత కార్యక్రమాలు తర్వాత నిలిచిపోయాయి. ప్రస్తుతం పిరాట్ల రమణి అధ్యక్షురాలిగా, దుర్భా హరిబాబు శాస్త్రి కార్యదర్శిగా ఉన్న నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మళ్లీ కార్యకలాపాల నిర్వహణ చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నుంచి పదో తేదీ వరకు అయిదురోజులపాటు సంగీత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల్నుంచి 9.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజున చెన్నైకు చెందిన వివేక్ మొజికులమ్ గాత్ర కచేరీ ఉంటుంది. పప్పు జ్ఞానదేవ్ వయొలిన్‌పై కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందిస్తారు. 7వ తేదీన విశాఖపట్నంకు చెందిన గాయని వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్ర కచేరీ ఉంటుంది. మహాదాసు నీలాద్రి వయోలిన్‌పై మహాదాసు ఏడుకొండలు మృదంగంపై సహకరిస్తారు. 8వ తేదీన హైదరాబాద్‌కు చెందిన గాయకుడు ఘోరకవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్ గాత్రకచేరీకి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై రాయప్రోలు సుధాకర్ సహకరిస్తారు. 9న చెన్నైకు చెందిన కోట పూర్వధనశ్రీ–పావనిల గాత్రకచేరీని ఏర్పాటుచేశారు. వ్యాకరణం గాయత్రి విభావరి, కేవీ రామకృష్ణ వాద్య సహకారం ఇస్తారు. చివరిరోజైన 10వ తేదీన హైదరాబాద్ గాయకుడు జొన్నలగడ్డ శ్రీరామ్ గాత్ర కచేరీ ఉంటుంది. మహావాది వాసు, బుర్రా శ్రీరామ్‌లు వాద్య సహకారం చేస్తారు. సంస్థ ఉపాధ్యక్షుడు దుర్భా కొండిన్యసాయి, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, కోశాధికారి సుబ్బారావు పర్యవేక్షిస్తారు.

రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



పాత గుంటూరు: రింగు రోడ్డులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ప్రారంభమైన రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు ఆర్.కె. నాయుడు, శైలజా రామ్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో క్లాత్, జ్యూయలరీ, హోమ్ డెకార్స్‌కు సంబంధించిన 40కు పైగా స్టాల్స్ ఉన్నాయని చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ సందర్శించాలని వారు కోరారు.

ఎన్ఎస్ఎస్ విభాగంలో బీఈసీకి అవార్డులు


అవార్డులు వచ్చిన ప్రొఫెసర్లను అభినందిస్తున్న సెక్రెటరీ ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల అర్బన్: ఎన్ఎస్ఎస్ విభాగంలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలకు అవార్డులు రావడం సంతోషంగా ఉందని కళాశాల ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన వర్సిటీ లెవెల్ ఎన్ఎస్ఎస్ అవార్డులు ఎంపికలో బెస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన జీ.కళ్యాణి అవార్డు అందుకున్నారు. ఇదే కాలేజీకి చెందిన విద్యార్థినులు పి.హైందవి, వై.లక్ష్మీతులసి ఉత్తమ వలంటీర్ అవార్డులు కైవసం చేసుకున్నారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కే కృష్ణకుమారి జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరుగా నియమితులయ్యారు. విద్యార్థినులు ఏ స్వాతి, వెస్ట్ జోన్ ప్రీ ఆర్డీ క్యాంప్‌కి ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ సేవలందిస్తూ అవార్డులు సాధిస్తున్న వారిని ముప్పలనేని శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీ.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిత, విభాగాధిపతులు ఓ శ్రీదేవి, మహాలక్ష్మి, జి.వెంకటేశ్వరి అభినందించారు.

బహుళ అంచెల సాగుతో అధిక దిగుబడులు


బహుళఅంచెల సాగుపై క్షేత్రస్థాయి శిక్షణ పొందుతున్న రైతులు

గుంటూరు రూరల్: బహుళ అంచెల సాగు ద్వారా తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు పండించి మంచి దిగుబడులతో అధిక ఆదాయం పొందవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ తెలిపారు.వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు బహుళ అంచెల సాగు విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ప్రస్తుతం కూరగాయలు, పండ్ల తోటల సాగుకి రాయితీలు అందజేస్తున్నామని, బహుళ అంచెల సాగుకు కూడా వర్తింపజేసేలా కృషి చేస్తానని చెప్పారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుళ అంచెల సాగు రూపకర్త ఆకాష్ చౌరాసియా రైతులకు శిక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. పందిరి బొంగులు ఏర్పాటు, సాగు విధానం గురించి ఆకాష్ చౌరాసియా రైతులకు ప్రత్యక్షంగా వివరించడంతో పాటు వారితో చేయించారు. పట్టణాలలో లేదా నగరాలలో 200 గజాల స్థలం ఉన్న వారంతా కుటుంబానికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలతో పాటు క్యారెట్, ముల్లంగి, అల్లం, దుంప కూరలు, బొప్పాయి, సపోటా లాంటి పండ్ల మొక్కల్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతు ఏడుకొండలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం


బాధితులకు ఆర్థిక సహాయం అందజేసిన షాలేం రాజు

అమృతలూరు(వేమూరు): అగ్నిప్రమాద బాధితులకు గ్రేస్ ఫౌండేషన్ సంస్థ ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. మండల కేంద్రంలోని ఉత్తర దళితవాడలో గత కొద్ది రోజుల క్రితం నన్నెపాగ లక్ష్మి, ఇల్లు అగ్ని ప్రమాదం వల్ల పూర్తిగా దగ్ధమైంది. బాధితురాలకు ఆదివారం బీరువా, మంచం, కుర్చీలు, దుస్తులు, నిత్యావసరాలు, కూరగాయలు, వంట సామగ్రి, బియ్యంతో పాటు రూ.25 వేలు అందజేశారు. సంస్థ ప్రతినిధి కై తేపల్లి షాలేం రాజు మాట్లాడుతూ వేమూరు నియోజక వర్గంలో అగ్ని ప్రమాద బాధితులకు అదుకునేందుకు గ్రేస్ ఫౌండేషన్ సంస్థ ముందు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, గుంటూరు ఏసుపాదం, యలవర్రు మాజీ సర్పంచి ఇంటూరు విజయభాస్కర్, అమృతలూరు వెంకయ్య గ్రంధి సురేష్, జంపని రవి గౌడ్, బండెల సురేష్, నెల్లూరు రవి, పచ్చిగళ్ల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగువారి జీవన పాఠాలు శతకాలు

డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ


డాక్టర్ విశ్వనాథశర్మను సత్కరించిన వెంకటరత్నం, రవిబాబు

తెనాలి: శతకానికి తెలుగువారి జీవితానికి విడదీయలేని బాంధవ్యం ఉందని, శతకాలు తెలుగువారికి జీవన పాఠాలని ప్రముఖ పండితుడు డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ అన్నారు. శతకాలు చేసిన మార్గదర్శనాలతో తెలుగువారు తమ జీవితాలను పండించుకున్నారని సోదాహరణంగా చెప్పారు. వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'ఆంధ్ర సాహిత్యంలో శతక వైభవం' అనే అంశంపై డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రత్యేక ప్రసంగం చేశారు. 12వ శతాబ్దంలో ప్రారంభమైన శతక సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించి మరే భాషలోనూ లేని ఔన్నత్యాన్ని సాధించిందని చెప్పారు. సుమతీ శతకం, వేమన శతకం నుంచి దాశరథి శతకం వరకు ఆయా కాలాల్లో ప్రజలకు చేసిన మార్గదర్శకాన్ని, నేర్పిన జీవిత విలువలను ఆయన సోదాహరణంగా వివరించారు. సమావేశంలో ఇటీవల మరణించిన బొమ్మదేవర వెంకటేశ్వరరావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావుకు నివాళులర్పించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యదర్శి కడియాల రవిబాబు మాట్లాడారు. చివరగా డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మను సత్కరించారు.

దీర్ఘకాల మధుమేహంతో గుండెపోటుకు అవకాశం


మాట్లాడుతున్న డాక్టర్ శివ శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహ బాధితులలో నాడులు దెబ్బతిని న్యూరోపతికి గురి కావడం వల్ల గుండెపోటు వచ్చిన పెద్దగా నొప్పి తెలియదని, ఫలితంగా నిశ్శబ్దంగా మరణిస్తున్నారని నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గుండం శివ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం బ్రాడీపేట లోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో గుండెజబ్బుల శాస్త్రీయ అవగాహన సభ- ఉచిత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శివ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటును అదుపులో ఉంచకపోతే గుండె, రక్తనాళాల వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహార నియమాలు పాటించడంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం శిబిరంలో పలువురికి ఉచితంగా ఈసీజీ పరీక్ష చేసి వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌వో మేనేజర్ పి.నిర్మలారాణి , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పి.రమేష్, వి.సుబ్రహ్మణ్యం, టి.వి. సాయిరాం ,లక్ష్మీ సామ్రాజ్యం, శివాజీ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా ఆదివారం కళాలయ మెలోడీస్ వ్యవస్థాపకుడు ఏ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పాటల్ని గాయకులు పి.మొగిలి, ఈ. భరత్‌రెడ్డి, ఎం.ఎల్. మల్లేశ్వరరావు, రత్నాజీ, పి.గాయత్రీదేవి, యు. పావని వీనులవిందుగా ఆలపించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కళాకారుల్ని సత్కరించారు.

క్లుప్తంగా

జీజీహెచ్‌లో పింఛన్ అందజేత



వేమూరు: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పలువురికి వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలోని చావలి గ్రామానికి చెందిన విష్ణుమూర్తి, ఎస్.ప్రసాద్, సామ్రాజ్యంకు పింఛన్లు వలంటీర్ లక్ష్మీనారాయణ అందించారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయప్రధాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పూజలను ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి. కృష్ణమోహన్ కోరారు. ఆదివారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, పెసర్లంక, పెదపులివర్రు గ్రామాల్లోపార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల 8వ తేదీన భట్టిప్రోలుకు చేరుకుంటుందని తెలిపారు. స్థానిక రథం సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం. సత్యనారాయణ, జి.నాగరాజు, కె.రామస్వామి, పి.మనోజ్ పాల్గొన్నారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన

రేపల్లె: స్పందన సోమవారం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ హేలా షారోన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పందన కార్యక్రమంలో అందించవచ్చని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ ఆరాధన స్త్రీల ర్యాలీ



పాత గుంటూరు: కొత్తపేట కుగ్లర్ హాస్పిటల్ ఆవరణలోని ట్రినిటీ గురు మండలంలో లూథరన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరిశుద్ధ ఆరాధన స్త్రీల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఈఎల్సీ ప్రథమ మహిళ కె. ఆశా కిరణ్ పరదేశీబాబుకు లూథరన్ సంఘ స్త్రీలు చర్చి మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె దేవుని వ్యాక్యోపదేశం చేశారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. రెవరెండ్ జె. దైవ ఆశీర్వాదం, రెవరెండ్ వి. క్రిష్టఫర్, సంఘ కాపరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బత్తుల లెనిన్, విల్సన్, బి. గ్రేస్ సుదర్శన్ భీమ్‌రాజు, టి. రాజేష్ పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం నందివెలుగు ప్రధాన కూడలి సమీపంలో, కొలకలూరు వంతెన వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఆరుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు.